క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కందుకూరు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భూలక్ష్మి ఆస్పత్రిలో గురువారం ఉచిత కీళ్ల నొప్పులు, కిడ్నీ జబ్బుల వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న శిబిరంలో వైద్యులు బీఎండీ, న్యూరో, యూరిక్ ఆసిడ్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పహాడీషరీఫ్: ఎర్రకుంట అభివృద్ధిలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారం మరువలేనిదని జల్‌పల్లి మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ దిలుసా హసన్ షా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంటలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, దయానీ, ఇబ్రహీం, నూర్, హమీద్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

కేవైసీ నమోదుకు గడువు ఉంది

తుక్కుగూడ: వంట గ్యాస్ కోసం కేవైసీకి వివరాలు సమర్పించేందుకు వినియోగదారులు అనవసరంగా కంగారు పడవద్దని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాహసీల్దార్ రఘునందన్ సూచించారు. బుధవారం తుక్కుగూడ వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉజ్వల గ్యాస్ వినియోగదారులు కేవైసీ నమోదుకు ఈ నెల చివరి తేది (డిసెంబర్) వరకు గడువు ఉందన్నారు. అలాగే సాధారణ గ్యాస్ వినియోగదారులు వచ్చే ఏడాది మార్చి నెల వరకు వెసులుబాటు ఉందని తెలిపారు. కేవైసీ కొరకు ఎలాంటి రుసుము చెల్లించవద్దని, ఎవరైనా వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని కోరారు.

ప్రజా సమస్యలపై స్పందించండి

ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని చెప్పారు. అనంతరం ఎంపీడీఓ చౌదర్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నుల వసూలు, నర్సరీల్లో మొక్కల పెంపకం, వాటి సంరక్షణ తదితర అభివృద్ధి పనులపై చర్చించారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు

యాచారం: గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులు ఈకేవైసీ కోసం బుధవారం మండల కేంద్రంలోని ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ఎదుట పడిగాపులు కాశారు. లబ్ధిదారులు రాయితీ పొందాలంటే ఈకేవైసీ నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీంతో బుధవారం మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు తరలించారు. నెట్‌వర్క్ సమస్య వల్ల ఈకేవైసీ నమోదుకు అవాంతరాలు ఏర్పడ్డాయి.

ఆమనగల్లులో ధనుర్మాస వైభవం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి ఏడాది నెల రోజుల పాటు వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులతో కలిసి తిరుప్పావై ప్రభంద విన్నపం నిర్వహించారు.

రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిచారని కొనియాడారు. 35 ఏళ్ల తర్వాత ఇబ్రహీంపట్నం గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరవేశారని ప్రశంసించారు.

బాలాజీసింగ్‌కు 'ఎమ్మెల్సీ' ఇవ్వాలి

కడ్తాల్: అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి, అచ్చంపేట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ ఠాకూర్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆ పార్టీ గిరిజన నాయకుడు బిక్కునాయక్ కోరారు.

పేరు గొప్ప ఊరు దిబ్బ

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- ఏడాదిన్నరగా పారుతున్న మురుగు
- కంపుకొడుతున్న కాలనీలు
- పట్టించుకోని పాలకవర్గం, అధికారులు



డ్రైనేజీని బయటకు పంపేందుకు ఏర్పాటు చేసిన మోటర్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రజలు వివిధ రకాల పన్నులు చెల్లిస్తున్నా.. మౌలిక సదపాయాలు సమకూరడం లేదు. కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ లైన్లు స్తంభించి మురుగు నీరు విధుల గుండా ప్రవహిస్తోంది. దీంతో వీధులన్నీ మురికికూపాలుగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఆదాయంలో పన్నులు రాబట్టడంలో బడంగ్‌పేట కార్పొరేషన్ సిబ్బంది మంచిపేరు సంపాదించుకున్నారు. కానీ సమస్యల పరిష్కారంలో అట్టడుగున ఉన్నారనే విమర్శలు మూటకట్టుకుంటున్నారు. ఇక్కడి సిబ్బంది పాలకుల మెప్పు కోసం సమస్యలను గాలికొదిలేస్తున్నారని స్థానికులు అంటున్నారు. పాలకులు, అధికారులు కుమ్మక్కై సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని బహటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం

కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్‌లో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. పరిష్కారం కోసం అధికారులు, కార్పొరేటర్ల దృష్టికి తెచ్చినా.. పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. 29వ డివిజన్ లోని రామిడి చంద్రారెడ్డి కాలనీలో ఏడాదిన్నరగా డ్రైనేజీ పొంగుతూ చెరువులు, కుంటలను తలపిస్తోంది. గాంధీనగర్, సబితాఇంద్రారెడ్డి నగర్, మెయిన్‌రోడ్డులోని పలు కాలనీల మురుగు లైన్లు రామిడి చంద్రారెడ్డి కాలనీ మీదుగా వెలుతున్నాయి. లీకేజీల వల్ల చంద్రారెడ్డి కాలనీలో మురుగు పొంగి పొర్లుతోంది. అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో 5హెచ్‌పీ మోటర్‌తో డ్రైనేజీని బయటకు పంపే ప్రయత్నం చేశారు. నీటిని బయటకు పంపేందుకు నాలాను ఓపెన్ చేశారు. దీంతో మరింత కంపు కొడుతోంది. నీటిని పక్క కాలనీల్లో వదులుతుండటంతో అక్కడి ప్రజలు కూడా అవస్థపడుతున్నారు. మురుగుతో పాటు రోడ్డును మూసేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించకపోతే ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

డెంగీతో నా మనువడు మృతి చెందాడు



ఏడాదిగా పొంగుతున్న డ్రైనేజీ వల్ల దుర్వాసన భరించలేక పోతున్నాం. ఆరు నెలల క్రితం డెంగ్యూతో నా మనవడు మృతి చెందాడు. పరామర్శించడానికి మాజీ మంత్రి సబితారెడ్డితో పాటు మేయర్, కార్పొరేటర్లు వచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు పట్టించుకొనే నాథుడే లేడు. సకాలంలో పన్నులు చెల్లిస్తున్నా.. వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

– దీపక్ శ్రీవాస్తవ, రామిడిచంద్రారెడ్డి కాలనీ

పాలకులు, అధికారులు కుమ్మక్కు



పాలకులు, అధికారులు ఒక్కటై ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేస్తున్నారు. ఏడాదిన్నరగా కాలనీలో డ్రైనేజీ పొంగుతున్నా పట్టించుకోవడం లేదు. సకాలంలో పరిష్కరించినప్పుడే అధికారులపై నమ్మకం ఏర్పడుతుంది.

– లాలా సందీప్, బడంగ్‌పేట

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన నాగారం



అయ్యప్ప మహా పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

మహేశ్వరం: స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో నాగారం గ్రామం మార్మోగింది. మంగళవారం రాత్రి మండల పరిధిలోని నాగారంలో గురుస్వామి కుండె కుమార్ స్వగృహంలో అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబు, కిట్టు గురు స్వాములు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి గీతాలు ఆలపించారు. గురుస్వాములు, భక్తులతో కలిసి అయ్యప్ప మహాపడిని కాల్చారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు శ్రీనివాస్‌రెడ్డి, కుండె వెంకటేశ్, వెంకట్‌రెడ్డి , పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, గ్రామ సర్పంచ్ బండారి లావణ్య, మాజీ సర్పంచ్ కావలి దశరథ, గ్రామ పెద్దలు లింగం, కిష్టయ్య, యాదయ్య పలువురు పాల్గొన్నారు.

కమలనాథుల్లో కలవరం

- తగ్గిన ఓటింగ్ శాతం
- ఆందోళనలో బీజేపీ శ్రేణులు
- నాయకత్వ సమస్యతో ఇబ్బందులు



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పార్టీ ఎదుగుదల లేకపోవడంతో కమలనాథుల్లో కలవరం మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కలేదు. నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నప్పటికీ వారి ఎత్తుగడలు పారడంలేదు. బీజేపీకి కేడర్ బలంగా ఉన్నప్పటికీ వారిని ఏకతాటిపై తెచ్చే నాయకుడే కరువయ్యాడు. ప్రధాని మోదీపై ప్రజల్లో ఉన్న ఆదరణ, నమ్మకం ,సెంటిమెంట్‌ను అనుకూలంగా మార్చుకోవడంలో కమలనాథులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

కార్యకర్తల్లో ఆందోళన

2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పోరెడ్డి నర్సింహారెడ్డికి 8,128 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో కొత్త అశోక్‌గౌడ్‌కి 17,129 ఓట్లు రాగా, 2023 ఎన్నికల్లో నోముల దయానంద్‌గౌడ్‌కు 15,790 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికలకంటే ఈ ఎన్నికల్లో ఓట్ల సంఖ్య తగ్గడం చర్చనీయాంశంగా మారింది. ఒక వైపు నియోజకవర్గంలో భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు పెరిగినా.. ఓట్లు రాబట్టడంలో బీజేపీ నేతలు విఫలయ్యారు. ఓటింగ్ శాతం తగ్గడంతో ఆ పార్టీ శ్రేణులు ఆందోళనలో ఉన్నాయి.

పార్టీ నాయకుల తీరు మారేనా..

నాయకుల తీరు మారినప్పుడే నియోజకవర్గంలో బీజేపీ బలపడుతుందని పలువురు అంటున్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తలకు సరైన ఆదరణ, గుర్తింపు కల్పించినప్పుడే ఆ పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తారని చెబుతున్నారు. దీనికి తోడు నాయకత్వ సమస్య వల్లే నియోజకవర్గంలో పార్టీ బలపడటంలేదనే చర్చ జోరుగా సాగుతుంది.

సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని వినతి



డీసీ అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేత పున్న గణేష్

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ డివిజన్ విజయపురి కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ కోరారు. ఈ మేరకు ఆయన కాలనీవాసులతో కలిసి సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామకృష్ణాపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ నుంచి వచ్చే వరద నీరు విజయపురి కాలనీలో రోడ్ నంబర్ 1లో నిలుస్తుండటంతో లెవల్ చూసి సీసీ రోడ్డు వేసేందుకు ఐదు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి అలాగే వదిలేశాడన్నారు. దీంతో కంక తేలి అస్తవ్యస్తంగా తయారైన ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందు స్థానికులతో పాటు ఇతర కాలనీల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని గణేశ్ తెలిపారు. తమ వినతికి స్పందించిన సరూర్ నగర్ డీఈ అరుణకుమారి వెంటనే కాంట్రాక్టర్‌తో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారన్నారు. పనులు చేపట్టేందుకు ప్రస్తుత కాంట్రాక్టర్ ముందుకు రాకపోతే వేరే కాంట్రాక్టర్‌కు పనిని అప్పగించాలని చెప్పారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, శివ, దుర్గా ప్రసాద్, మణికంఠ, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో గడ్డికోత యంత్రాలు

పశువైద్య అధికారి దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: సబ్సిడీపై గడ్డి కోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవిరెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ త్రీహెచ్‌పీ, త్రీబ్లేడ్స్, త్రీ పేజ్ మోటర్స్ చాప్ కట్టర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. విశ్వకర్మ కంపెనీ యూనిట్ కాస్ట్ రూ.48 వేలు, సబ్సిడీ రూ. 10వేలు తగ్గిస్తే రూ. 38వేలకే వస్తుందన్నారు. వర్ష కంపెనీ యూనిట్ కాస్ట్ రూ. 46,500 సబ్సిడీ రూ.10వేలు పోగా రూ. 36,500లకు ఇస్తున్నారన్నారు. పాడి పశువులు కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు మాత్రమే సబ్సిడీపై ఇవ్వనున్నారని వ్యవసాయ అధికారి తెలిపారు. దీని కోసం 15రోజులలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని దేవిరెడ్డి తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

కొందుర్గు: పోలీసులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి సూచించారు. బుధవారం ఆయన కొందుర్గు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలురకాల రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన పోలీసులతో మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే వారికి ఇక్కడ తగిన న్యాయం జరుగుతుందని వారిలో భరోసా కలిగించేలా వ్యవహరించాలన్నారు. విధిగా ప్రతిఒక్కరూ డ్రెస్‌కోడ్ పాటించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని, దాతల సహకారంతో సీసీ కెమెరాలను అందుబాటులోకి తేవాలని సీఐ లక్ష్మిరెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య కృషిచేయాలని సూచించారు.

23న వైకుంఠ ఏకాదశి

శ్రీలక్ష్మీవేంకటేశ్వర దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

చేవెళ్ల: ఈ నెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్తరద్వార దర్శనాలకు ముస్తాబు చేస్తున్నారు. చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నట్లు ఆలయ పూజారులు శ్రీకాంత్, శ్రీపాద్‌లు, ఈఓ నరేందర్‌లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలనుంచి ఉత్తరద్వారం ద్వారా స్వామి వారి సర్వదర్శనం ఉంటుందని చెప్పారు. ఉదయం 11–30గంటలకు గరుడ సేవ చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

'మహాలక్ష్మి'పై తహసీల్దార్‌కు వినతి



కందుకూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

కందుకూరు: తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అమరేందర్, మండల ఇన్‌చార్జి భాస్కర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలందరికి ఉచిత ప్రయాణం కల్పించవద్దని, లక్షల వేతనం తీసుకునే మహిళలు, ధనవంతులైన మహిళలను ఆ పథకం నుంచి మినహాయించాలని కోరారు. పథకం అమలు వలన ఆటో కార్మికులు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వారికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మహేశ్, చక్రపాణి, అంజయ్య పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణాల పరిశీలన



బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదార్లను కోరారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్



పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో చెత్తను కాల్చివేస్తున్న దృశ్యం



కాలనీలో రోడ్డు పక్కనే చెత్తను తగులబెట్టిన దృశ్యం

- కాలనీల్లోనే చెత్త కాల్చివేత
- పారిశుద్ధ్య కార్మికుల నిర్వాకం

హస్తినాపురం: ఎల్‌బీ నగర్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను ఊడ్చి ఎత్తివేయకుండా ఎక్కడికక్కడే కాలనీల్లో, రోడ్ల పక్కనే కాల్చి వేస్తున్నారని పలు కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఎట్టి పరిస్థితుల్లో కాల్చవద్దని ఉన్నతాధికారులు చెప్తున్నా కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాలను లెక్క చేయడం లేదని అంటున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి మరీ చెత్తకుప్పలను తగుల బెట్టిస్తున్నారని, ఆ సమయంలో వస్తున్న పొగతో కళ్ల మంటలు వస్తున్నాయని, శ్వాస పీల్చలేకపోతున్నామని సమీపంలోని ఇళ్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం నాగార్జున సాగర్ రోడ్డు పక్కన ఉన్న పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో ప్రతిరోజూ చెత్తను తగుల బెడుతున్నారని, అదేమని అడిగితే ఇలాగే తగులబెడతాం అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీల్లో చెత్తను తగులబెట్టకుండా కిందిస్థాయి సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

చురుగ్గా సమీకృత మార్కెట్ పనులు



ఆమనగల్లులో కొనసాగుతున్న మార్కెట్ నిర్మాణ పనులు

- రూ.4.50 కోట్లతో నిర్మాణం
- కొనసాగుతున్న పనులు
- త్వరగా అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆధునిక హంగులతో సమీకృత మార్కెట్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేసి మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలో కూరగాయలు, మాంసం విక్రయాలకు నిర్ణీతస్థలం లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని అంగడిబజార్‌లో, గాంధీచౌక్ వద్ద కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ఇక మాంసం విక్రయాలు పట్టణంలోని పలుచోట్ల నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసు స్టేషన్ వెనుక మాల్‌రోడ్డులో చేపల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. స్థానిక పట్టణంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీగా ఏర్పాటైన అనంతరం కూరగాయలు, మాంసం, చేపలు ఒకే చోట విక్రయించడానికి వీలుగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా వ్యవసాయ మార్కెట్‌ఆవరణలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు ఎకరా భూమి కేటాయించారు. దీంతో 2021 నవంబర్ 8న అప్పటి వ్యవసాయ శాఖామంత్రి నిరంజన్‌రెడ్డి, విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. మార్కెట్ పనులను టెండర్‌లో దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అణగారిన వర్గాలకు విద్యతోనే గుర్తింపు



సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మీ ప్రసన్నగౌడ్, గీతారెడ్డి, పెద్దపూర బ్రహ్మయ్య

నాగోలు: విద్య ద్వారానే అణగారిన వర్గాలకు సమాజంలో గుర్తింపు వస్తుందని చెప్పిన వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నగౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ స్ఫూర్తి ప్రధాత సంత్ గాడ్గే బాబా 67 వర్ధంతిని బుధవారం నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలో తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య, ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్గే బాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కార్మికులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాడ్గే బాబా చేసిన సేవా కార్యక్రమాలు చిరస్మరణీయమని, యువత గాడ్గే బాబాను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. అంబేడ్కర్‌కు గురువుగా గాడ్గే బాబా అనేక సూచనలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య, ఎంఆర్ రావు, పగడాల ఎల్లయ్య, నాగిళ్ల యాదగిరి, పగడాల ఉమాపతి, పగిళ్ల వెంకటేష్, పున్నం రాములు, జూపల్లి రామకృష్ణ, చెరుకు ఉమేష్ గౌడ్, సిద్దాల అరవింద్, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ కె.గాంధీ నాయక్ పాల్గొన్నారు.